
సాక్షి ఒడిశా

శుక్రవారం । 22 । డిసెంబర్ । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం గురువారం లెక్కించారు. ఇందులో నగదు రూ.3.51.992లు. బంగారం 850 మిల్లీగ్రాములు. వెండి 147 గ్రాములు 500 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



కొరాపుట్ జిల్లాలో గవర్నర్ పర్యటన

రాష్ట్ర గవర్నర్ రఘుబర్ దాస్ కొరాపుట్ జిల్లాలో గురువారం విస్తృతంగా పర్యటించారు.

- 8లో▸



ముస్తాబైన చర్చిలు

బరంపురం నగరంతో పాటు జిల్లావ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో నిర్వహించనున్న క్రిస్మస్ వేడుకలకు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు.

- 8లో▸

న్యూస్‌రీల్

విజిలెన్స్ దాడులు



సోదాల్లో బయటపడిన నగలు

భువనేశ్వర్: ఆదాయానికి మించిన ఆస్తుల ఆరోపణలపై స్థానిక చీఫ్ సివిల్ సప్లయ్ ఆఫీసర్ ప్రశాంత కుమార్ గంతాయత్‌పై రాష్ట్ర విజిలెన్స్ నిఘా వేసింది. ఈ నేపథ్యంలో గురువారం ఆయనకు సంబంధించిన ఆస్తులపై ఏకకాలంలో సోదాలు ప్రారంభించారు. స్థానిక విజిలెన్స్ ప్రత్యేక న్యాయమూర్తి జారీ చేసిన సెర్చ్ వారెంట్ల ఆధారంగా భువనేశ్వర్, గంజాం జిల్లాల్లోని ఒకేసారి ఎనిమిది చోట్ల 8 మంది డీఎస్పీలు, 5 మంది ఇన్‌స్పెక్టర్లు, రాష్ట్ర విజిలెన్స్ ఇతర సిబ్బంది సోదాలు నిర్వహిస్తున్నారు.

యువతి దుర్మరణం



మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

రాయగడ: జిల్లాలోని కల్యాణ సింగుపూర్ సమితి ఖటగంట గ్రామంలో వరినూర్పు యంత్రానికి ఉన్నటువంటి ఫ్యాన్ రెక్కలు తగలడంతో ఒక యువతి దుర్మరణం పాలయ్యింది. గురువారం చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి మృతి చెందిన యువతి బనితా తియక (19) గా గుర్తించారు. వివరాల్లోకి వెళ్తే.. ఖటగంట గ్రామానికి చెందిన బనితా, ఆమె తండ్రి ధొనియా, తల్లి లక్ష్మీలు కలిసి బొడొతొడ్ర గ్రామంలో ఉన్న సిరిపొతి కద్రక వద్ద ధాన్యం నూర్పుచేసే యంత్రం వద్ద పనులు చేస్తున్నారు. ఈ క్రమంలో బనిత అజాగ్రత్త వలన ఆమె కట్టుకున్న ఓణి యంత్రం ఫ్యాన్‌లోకి వెళ్లడంతో ప్రమాదం జరిగింది. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి పంట ధ్వంసం



గంజాయి పంటను ధ్వంసం చేస్తున్న అధికారులు

బరంపురం: గంజాం జిల్లాలో గంజాయి పంటపై ఎక్సైజ్, పోలీసు అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. కలెక్టర్ దివ్యజ్యోతి పరిడా ఆదేశాలతో ముమ్మరంగా దాడులు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా గురువారం దిగపండి పోలీసుస్టేషన్ పరిధి డెంగపదర్ గ్రామ పంచాయతీకి అనుకొని గంజాం–గజపతి–కొందమాల్ మూడు జిల్లాల సరిహద్దుల్లో ఉన్నటువంటి కామన్‌కులా అటవీ ప్రాంతంలో అక్రమంగా సాగు చేస్తున్న గంజాయి పంటపై దాడులు చేపట్టారు. దీనిలో భాగంగా రూ.కోట్లు విలువ చేసే పంటను ధ్వంసం చేశారు.

నిరాకర్‌పూర్‌లో ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌కు హాల్టు

భువనేశ్వర్: భువనేశ్వర్ – బెంగుళూర్‌ల మధ్య రాకపోకలు చేస్తున్న 18463/18464 నంబర్ల ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ రైలు ఇక నుంచి తూర్పు కోస్తా రైల్వే ఖుర్దారోడ్ మండలం నిరాకర్‌పూర్ రైల్వే స్టేషన్‌లో ఆగుతుంది. ప్రయాణికుల కోరిక మేరకు ఈ హాల్టు ప్రయోగాత్మకంగా కల్పించినట్లు రైల్వే శాఖ పేర్కొంది. స్థానిక రైల్వే జోన్ నిర్ధారణ మేరకు నిరాకర్‌పూర్‌లో ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ రైలు ఆగడం మొదలవుతుంది. ఈ సదుపాయం కల్పించిన నుంచి నిరాకర్‌పూర్ రైల్వేస్టేషనులో ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ ప్రయాణానికి టికెట్ల విక్రయంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని రైల్వే బోర్డు సూచించింది.

కేంద్రం సాయమందించాలి

భువనేశ్వర్: ఉక్కు నగరం రౌర్కెలాలో విజృంభిస్తున్న అతిసార వ్యాధిని అరికట్టేందుకు రౌర్కెలాకు ఆరోగ్య మంత్రిత్వ శాఖ జోక్యంతో పాటు కేంద్ర సాయం అందించాలని కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ కోరారు. ఈ మేరకు కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవియాకు గురువారం లేఖ రాశారు. రౌర్కెలాలో అతిసార వ్యాప్తి కట్టడి విషయంలో వ్యక్తిగతంగా జోక్యం చేసుకోవాలన్నారు. ఇటీవల విజృంభిస్తున్న అతిసారాన్ని నియంత్రించడానికి, పరిష్కరించడానికి రౌర్కెలా సమీపంలోని ప్రభావిత ప్రాంతానికి కేంద్ర సాయం కోసం అత్యవసరంగా వ్యక్తిగత జోక్యాన్ని కోరుతున్నట్లు లేఖలో పేర్కొన్నారు. అతిసార వ్యాప్తి, తీవ్రత ప్రజారోగ్యానికి ప్రమాదం కలిగిస్తుందనే భయాందోళన కలవరపరుస్తోందని వివరించారు. వ్యాధి తీవ్రతతో ఇప్పటివరకు కనీసం 8 మరణాలు నమోదయ్యాయని, 600 మందికి పైగా పీడితులు ప్రస్తుతం చికిత్స పొందుతున్నారని వివరించారు. నీరు కలుషితం కావడమే వ్యాధికి కారణమని పేర్కొన్నారు. వ్యాధి వ్యాప్తిని నియంత్రించడానికి రౌర్కెలా, ఇతర ప్రభావిత ప్రాంతాలకు కేంద్ర సహాయాన్ని అందజేయాలని అభ్యర్థించారు.



ఉత్సవాలు ప్రారంభిస్తున్న దృశ్యం



ఒడిస్సీ నృత్య ప్రదర్శన



అస్సామీ బిహు నృత్యం



పశ్చిమ బెంగాల్ కళాకారుల నృత్యం

సాంస్కృతిక సమాహారం..
గజపతి ఉత్సవం

పర్లాకిమిడిలోని గజపతి స్టేడియంలో జిల్లాస్థాయి గజపతి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. దీనిలో భాగంగా చేపడుతున్న సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకుంటున్నాయి. ఉత్సవాల వేదికపై చేపట్టిన గండాహతి, మహేంద్రగిరి పర్వతాల డిజైన్లు చూపరులను కట్టిపడేశాయి. ఈ సందర్భంగా ఆర్.ఉదయగిరి సమితి అధ్యక్షుడు లక్ష్మీనారాయణ శోబోరో మాట్లాడుతూ.. గజపతి జిల్లాలో పర్యాటక కేంద్రాలు రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి చేయాలని కోరారు. ఏడీఎం (రెవెన్యూ) బీరేంద్ర కుమార్ దాస్ మాట్లాడుతూ.. మహేంద్రగిరి పర్వతం సందర్శనకు వెళ్తే అద్భుత అనుభవం కలుగుతుందన్నారు. ఏడు సమితుల అధ్యక్షులకు అదనపు కలెక్టర్ దాస్ చేతుల మీదుగా మొమెంటోలను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు, అధికారులు, వివిధ వర్గాల ప్రజలు పాల్గొన్నారు.

– పర్లాకిమిడి



సువాగడ సవర నృత్యం



కొరాపుట్ సవర నృత్యం



కళాకారిణి ప్రియాంక ఆధ్వర్యంలో మహిషాసుర మర్దిని నృత్య ప్రదర్శన



ప్రశంసా పత్రాలతో ఒడిస్సీ నృత్య కళాకారులు



పశ్చిమ బెంగాల్ పురులియా చౌ డ్యాన్స్

గన్నేరు పప్పు తిని మహిళ ఆత్మహత్య



సాయి బేతి మృతదేహం

మల్కన్‌గిరి: జిల్లాలోని కలిమెల సమితి మోటు పరిధి లూగాల్ పంచాయతీలో నివాసముంటున్న బేతి కన్న అనే వ్యక్తి భార్య సాయి బేతి (22) గురువారం ఉదయం గన్నేరు పప్పు తిని ఆత్మహత్య చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. సాయి బేతి కాలి నొప్పులతో బాధపడుతోంది. దీంతో రెండు రోజులుగా పొలం పనులకు ఆమె వెళ్లకపోవడంతో భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. గురువారం వరికోత కోసం కన్న తన తల్లితో కలిసి పొలానికి వెళ్తూ, భార్యను సైతం వరికోతకు రమ్మని చెప్పాడు. దీంతో ఇంటి వద్దనే ఆమె గన్నేరు పప్పు తిని పొలానికి వెళ్లింది. అనంతరం కొద్దిసేపటికే నోటివెంట నురగలు వచ్చి పడిపోయింది. అది చూసిన అత్త, భర్తలు సమీపంలో ఉన్నవారి సాయంతో ఎంవీ 79 ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి అప్పటికే ఆమె మృతి చెందినట్లు ధ్రువీకరించారు. విషయం తెలియడంతో మోటు పోలీసులు ఆరోగ్య కేంద్రానికి వచ్చి మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. కలిమెల ఆరోగ్య కేంద్రంలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మహరాజ్‌పల్లి పంచాయతీ బలిగూడ గ్రామానికి చెందిన సాయికి కన్నతో మూడేళ్ల క్రితం వివాహం జరిగింది.

రాష్ట్రంలో అవినీతి పాలన



మల్లికార్జున్ ఖర్గే అధ్యక్షతన ఏఐసీసీ సమావేశం

- బీజేపీతో బీజేడీ లోపాయకారి ఒప్పందం
- కాంగ్రెస్ నాయకుల మండిపాటు



సమావేశానికి హాజరైన ఒడిశా నాయకులు

భువనేశ్వర్: రాష్ట్రంలోని బిజూ జనతా దళ్ (బీజేడీ) ప్రభుత్వం అన్నిరంగాల్లో భారీ అవినీతికి పాల్పడుతోందని కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. న్యూఢిల్లీలోని ఏఐసీసీ కార్యాలయంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే అధ్యక్షతన గురువారం జరిగిన పార్టీ నేతల సమావేశం అనంతరం అఖిల భారత కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర కాంగ్రెసు వ్యవహారాల ఇన్‌చార్జి డాక్టర్ ఎ.చెల్లకుమార్ విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రజలు బీజేడీ పాలనలో విపరీతమైన అవినీతి, నిరుద్యోగం, దౌర్జన్యాలతో విసిగిపోయారని ఆరోపించారు. రాష్ట్రంలో అధికార బిజూ జనతా దళ్ పార్టీ, భారతీయ జనతా పార్టీలు చేతులు కలిపి లోపాయకార మైత్రితో అవినీతి చేస్తున్నాయని ఆరోపించారు. రాష్ట్రంలో జరిగిన అక్రమాలను బట్టబయలు చేసేందుకు నేరారోపణ చిట్టా బహిరంగపరుస్తామని వెల్లడించారు.

రాష్ట్రం వెనుకబడిపోయింది

అధికార బీజేడీ పాలనలో రాష్ట్రం అన్ని విధాలుగా వెనుకబడిపోయిందని కాంగ్రెస్ నేతలు ఆరోపించారు. రాష్ట్రాన్ని బలోపేతం చేయడం, ప్రజలకు అనుకూలమైన సమస్యలను లేవనెత్తడంలో కాంగ్రెస్ ప్రయత్నాలను రెట్టింపు చేసిందని చెప్పారు. రాష్ట్రంలోని అవినీతి బీజేడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజల్లోకి వెళ్లి ప్రజాభిప్రాయాన్ని సేకరించనున్నట్లు ఒడిశా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు శరత్ పట్నాయక్ తెలిపారు. వరుస కుంభకోణాలతో రాష్ట్రం కుదేలైందని దుమ్మెత్తిపోశారు. బీజేడీ హయాంలో ఒడిశాలో గనుల కుంభకోణం, చిట్‌ఫండ్ తదితర మోసాలు అనేకం ఎదురుచూశాయన్నారు. సమస్యలన్నింటినీ ప్రజల ముందు లేవనెత్తుతామని పేర్కొన్నారు. సమావేశానికి ఏఐసీసీ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ, ఒడిశాకు చెందిన 30 మంది సీనియర్ నాయకులు, ఒడిశా మాజీ పీసీసీ అధ్యక్షుడు నిరంజన్ పట్నాయక్, జయదేవ్ జెనా, కాంగ్రెస్ శాసన సభ నాయకుడు నరసింగ మిశ్రా, ఎమ్మెల్యేలు తారా ప్రసాద్ బాహినీపతి, సంతోష్ సింగ్ సలూజా, ఓపీసీసీ ప్రచార కమిటీ చీఫ్ బిజయ్ పట్నాయక్ తదితరులు హాజరయ్యారు.

సువేందు పరిజా మృతి



సువేందు పరిజా

భువనేశ్వర్: జట్నీ మున్సిపల్ మండలి మాజీ కార్పొరేటర్ సువేందు (మెఘు) పరిజా మృతి చెందారు. ఈయన ఖుర్దారోడ్ రైల్వే న్యూకాలనీ వార్డు నుంచి నిరవధికంగా 5 సార్లు కార్పొరేటర్‌గా ఎన్నికయ్యారు. వార్డు అభివృద్ధి కార్యకలాపాల్లో చురుకైన పాత్ర పోషించారు. ప్రధానంగా ఖుర్దారోడ్ బాలాజీ మందిరం అభివృద్ధి కార్యకలాపాల్లో గుర్తించదగ్గ సహకారం అందజేశారు. గత కొద్దికాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. స్థానిక బలిఛక్ సాహి ప్రాంతంలోని స్వగృహంలో బుధవారం అర్ధరాత్రి ఆరోగ్యం అకస్మాతుగా క్షీణించడంతో ఆస్పత్రిలో చేర్చినా ప్రయోజనం లేకపోయింది. ఆయన మృతిపై పట్టణ ప్రముఖులు, జట్నీ మున్సిపల్ సభ్యులు, అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు నివాళులర్పించారు. తండ్రి మరణించిన పదో రోజునే సువేందు మరణించడం ఆ కుటుంబాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది.

గజగజ

- యూబీకేలో సున్నా డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదు



సిమిలిపాల్‌లో మంటవద్ద చలి కాగుతున్న మేకపిల్ల

భువనేశ్వర్: రాష్ట్రంలో ఈ ఏడాది అత్యంత శీతలమైన రోజుగా గురువారం నిలిచింది. ఉదయం 6 గంటలకు సిమిలిపాల్ ఎగువ బొరొహా కముద (యూబీకే) ప్రాంతంలో 0 (సున్న) డిగ్రీల సెల్సియస్ కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. అలాగే రాష్ట్రంలో 13 చోట్ల రాత్రిపూట కనిష్ట ఉష్ణోగ్రత 10 డిగ్రీల సెల్సియస్ లేదా అంతకంటే తక్కువగా రికార్డు అయింది. గత 24 గంటల్లో రాష్ట్రంలోని 24 చోట్ల కనిష్ట ఉష్ణోగ్రతలు 15 డిగ్రీల సెల్సియస్ కంటే తక్కువగా నమోదయ్యాయని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) గురువారం తెలిపింది. స్థానిక వాతావరణ కార్యాలయం సమాచారం ప్రకారం ఉత్తర, వాయువ్య దిశ నుంచి వీచే శీతల గాలుల ప్రభావంతో రానున్న 2 రోజుల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు 1 డిగ్రీల సెల్సియస్ నుంచి 2 డిగ్రీల సెల్సియస్ వరకు తగ్గే అవకాశం ఉంది. జంట నగరాలైన భువనేశ్వర్, కటక్ ప్రాంతాల్లో వరుసగా 12.4 డిగ్రీల సెల్సియస్, 12.8 డిగ్రీల సెల్సియస్ కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

ప్రాంతం	ఉష్ణోగ్రత (డిగ్రీల సెల్సియస్)
ఎగువ బొరొహా కముద	0
నవనా	6.0
ఫుల్బాణి	6.5
గురుగురియా	7.0
కొరాపుట్	7.6
దారింగ్‌బాడి	8.0
అంగుల్	8.0
రౌర్కెలా	8.3
కెంజొహర్	8.4
బొరేహిపాణి	9.0
ఝార్సుగుడ	9.0
భవానీపట్న	9.0
నవరంగపూర్	9.0
సోన్‌పూర్	9.7
బొలంగీర్	10.0
రామతీర్థ	11.0
కియాఝొరి	11.0

నాటుసారాపై ఉక్కుపాదం



పెంటాగడలో స్వాధీనం చేసుకున్న నాటుసారా సామగ్రి

బరంపురం: గంజాం జిల్లా ఎక్సైజ్ అధికారులు బుధ, గురువారం రెండు రోజులు దిగపండి, చికిటి, పత్రపూర్ సరిహద్దుల్లో ముమ్మరంగా దాడులు నిర్వహించారు. అటవీ ప్రాంతాల్లో రహస్యంగా తయారు చేస్తున్న వంటసారా బట్టీలపై ఉక్కుపాదం మోపారు. సుమారు 2 వేల లీటర్ల విప్పపువ్వు ఊటను ధ్వంసం చేశారు. అలాగే సారా తయారీ సామగ్రి స్వాధీనం చేసుకొని, నిందితులను అరెస్టు చేశారు. అదేవిధంగా గోళంతర, హింజిలికాట్ పోలీసుస్టేషన్ల పరిధి కుసిమి, కుంచరడా ప్రాంతాల్లో ఎక్సైజ్ అధికారులు దాడులు చేసి నకిలీ మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. సంబంధిత నిందితులను అరెస్టు చేసినట్లు బరంపురం ఎక్సైజ్ అధికారి వివేకనంద నాయక్ తెలియజేశారు. అక్రమంగా నాటుసారా తయారీ, విక్రయాలు చేపడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.



కుసిమి ప్రాంతంలో స్వాధీనం చేసుకున్న నకిలీ మద్యం బాటిళ్లు



కుంచరడా ప్రాంతంలో సీజ్ చేసిన నకిలీ మద్యం



దిగపండిలో అరెస్టు చేసినవారిని చూపిస్తున్న పోలీసులు

క్లుప్తంగా

సేవలతోనే ఉద్యోగికి గుర్తింపు



ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న దృశ్యం

జయపురం: విధి నిర్వహణలో చేసిన సేవలతోనే ఉద్యోగికి గుర్తింపు లభిస్తుందని జయపురం సమితి ఉపాధ్యాయ సంఘ అధ్యక్షుడు దేవి ప్రసాద్ దాస్ అన్నారు. స్థానిక సెంట్రల్ యూపీ స్కూల్‌లో తెలుగు ఉపాధ్యాయురాలిగా పనిచేసిన దాసరి విజయలక్ష్మి ప్రమోషన్‌పై జాముండ ఒడియా పాఠశాలకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఆమెను గురువారం సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కలిమెలలో అగ్ని ప్రమాదం



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

మల్కన్‌గిరి: జిల్లాలోని కలిమెల సమితి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో గురువారం అగ్ని ప్రమాదం జరిగింది. కార్యాలయం బయట ఉన్నటువంటి చెత్త కాల్చిన సమయంలో కిటికీలకు మంట అంటుకున్నట్లు తెలుస్తోంది. వెంటనే కార్యాలయం సిబ్బంది స్పందించి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వెంటనే వారి వచ్చి మంటలను అదుపు చేశారు.

చోరీ కేసులో వ్యక్తి అరెస్టు

టెక్కలి రూరల్: సంతబొమ్మాళిలో ఇటీవల జరిగిన బంగారం చోరీ కేసుకు సంబంధించి అదే గ్రామానికి చెందిన జలుమూరు అప్పన్న అనే వ్యక్తిని గురువారం రాత్రి అరెస్టు చేసినట్లు సంతబొమ్మాళి ఎస్‌ఐ మధుసూదన రావు తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాలు ప్రకారం.. ఈ నెల 19వ తేదీన సంతబొమ్మాళి గ్రామానికి చెందిన తలగాపు జోగమ్మ అనే మహిళ ఇంట్లో చోరీ జరిగిందని పోలీసులకు ఫిర్యాదు అందింది. అనుమానిత వ్యక్తి గురించి సమాచారం అందడంతో పోలీసులు దర్యాప్తు మొదలుపెట్టారు. ఈ మేరకు గురువారం స్థానిక పాతబస్టాండ్ వద్ద ఆ వ్యక్తిని అదుపులో తీసుకుని విచారించగా తానే చోరీకి పాల్పడినట్లు అంగీకరించాడని, అతని వద్ద నుంచి 8.5 తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. అనంతరం ముద్దాయిని కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

సంబంధం లేదంటూనే..

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాలో మ్యూచువల్ ఫండ్స్‌కు సంబంధించి ఆ శాఖకు సంబంధం లేదంటూనే బాధితులు ఇచ్చిన ఫిర్యాదులను ఉన్నతాధికారి సంతకాలు లేకుండా ఖాతాలున్న బ్రాంచి మేనేజర్లకు మళ్లింపు చేస్తున్నట్లు తెలుస్తోంది. మ్యూచువల్ ఫండ్స్‌కు సంబంధించి ఓ వ్యక్తి ప్రమేయం ఉన్నట్లు వస్తున్న ఆరోపణల్లో తమకు వాస్తవాలేమిటో తెలియవని, అతనికి తమ సంస్థకు ఎలాంటి సంబంధం లేదని.. సంబంధిత మ్యూచ్‌వల్ ఫండ్స్ బ్యాంకునే సంప్రదించాలని ఉన్నతాధికారి చెప్పడం విశేషం. ఇదే విషయం సంబంధిత మ్యూచ్‌వల్ ఫండ్స్ బ్యాంకుకు వెళ్తే అక్కడ డిప్యుటేషన్‌పై ఉన్న అధికారి తమకేమీ తెలియవని, అంతా ముంబై హెడ్ ఆఫీసుకే మాట్లాడుకోవాలని, లేదంటే వెబ్‌సైట్‌లో నంబరును పరిశీలించుకోవా లంటున్నారు. బాధితులు సంస్థను నమ్మే ఇచ్చామ ని, అందులో విడివిడిగా విభాగాలుండి తమకు సంబంధం లేదంటే ఎలా అంటున్నారు.

'గుర్తుండే పనులేమైనా చేశారా..?'


సంతబొమ్మాళి: పద్నాలుగేళ్ల పాలించిన చంద్రబాబు నాయుడు జిల్లాకు గుర్తుండిపోయే అభివృద్ధి పనులేమైనా చేశారా అని టీడీపీ నాయకులను కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి సూటిగా ప్రశ్నించారు. హెచ్‌ఎన్‌పేట వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆమె గురువారం విలేకరులతో మాట్లాడారు. పాదయాత్రలో తాను ప్రతి గ్రామంలోనూ తిరిగానని, సీఎం వైఎస్ జగన్ అభివృద్ధి ఏమీ చేయలేదని లోకేష్ మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఆయన తండ్రి హయాంలో ఏం అభివృద్ధి చేశారో చెప్పాలని అన్నారు. రాష్ట్రంతో పాటు జిల్లా అభివృద్ధిలో సీఎం వైఎస్ జగన్ పాత్ర చాలా కీలకమైనదని అన్నారు. మూలపేట పోర్టుతో ఉత్తరాంధ్ర కల నెరవేరిందని అన్నారు. కొన్ని దశాబ్దాలుగా వేధిస్తున్న కిడ్నీ వ్యాధులను తరిమివేయడానికి సురక్షిత మంచినీటి పథకంతో పాటు ఆస్పత్రిని కూడా నిర్మించా రని తెలిపారు. వంశధారతో రైతులకు సాగునీరు, తాగునీరు అందుతోందన్నారు. రూ. 850 కోట్లతో ఆఫ్‌షోర్ నిర్మాణం జరుగుతోందని చెప్పారు. టీడీ పీ హయాంలో బీసీలను చాలా చులకన చేసి మా ట్లాడారని గుర్తుచేశారు. లోకేష్ వల్లే పార్టీ సర్వనాశనం అవుతోందని మాట్లాడిన అచ్చెన్నాయుడు మళ్లీ లోకేష్ నాయకత్వం వర్ధిల్లాలని అనడం దేనికి సంకేతమన్నారు. రానున్న ఎన్నికల్లో టెక్కల్లో వైఎస్సార్‌సీపీ జెండా ఎగరేస్తామని చెప్పారు. ఆమెతో పాటు జెడ్పీటీసీ పాల వసంతరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పి.రాజశేఖర్, నక్క భీమారావు, పి.రామకృష్ణ, జె.బాబురావులు ఉన్నారు.

ముస్తాబైన చర్చిలు



చర్చి రోడ్డులో క్రిస్మస్ వేడుకలకు ఏర్పాట్లు

బరంపురం: నగరంతో పాటు జిల్లావ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో నిర్వహించనున్న క్రిస్మస్ వేడుకలకు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. గిరిరోడ్, బిజయా టాకీస్, మేరిమాత చర్చి, బెజ్జిపూర్ తదితర ప్రాంతాల్లోని చర్చిలు వేడుకలకు సుందరంగా రూపుదిద్దుకున్నాయి. అలాగే వేడుకల్లో భాగంగా కొంధమాల్ జిల్లా బల్లిగుడా పట్టణంలో పోలీసు బలగాలు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు.



గిరి రోడ్డులో సుందరంగా రూపుదిద్దుకున్న చర్చి



బల్లిగుడా మార్కెట్‌లో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు



క్రిస్మస్ వేడుకలకు సిద్ధమైన చర్చి

● మార్గశిర శోభ





మార్గశిర మాసం చివరి గురువారం కావడంతో ప్రముఖ దేవస్థానాల్లో దేవీమూర్తులను ప్రత్యేకంగా అలంకరించారు. మార్గశిర మాసం లక్ష్మీ నోము గురువారంతో పూర్తయ్యింది. దీనిలో భాగంగా పూరీ శ్రీమందిరం తోరణ మహాలక్ష్మి, కటక్ చండీమాత ప్రత్యేక శోభతో భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.
- భువనేశ్వర్

నిధులు సద్వినియోగం చేసుకోవాలి



సమావేశంలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు

పర్లాకిమిడి: ఆదివాసీ ప్రాంతాల అభివృద్ధికి విడుదల చేస్తున్న నిధులను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర స్వతంత్ర అభివృద్ధి మండలి అధ్యక్షుడు ప్రదీప్ మఝి సూచించారు.

స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో గజపతి జిల్లా స్వతంత్ర అభివృద్ధి మండలి నాలుగో సమావేశం చైర్మన్ మరియం రైయితో అధ్యక్షతన గురువారం నిర్వహించారు. దీనిలో భాగంగా ఆదివాసీల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఆదివాసీ సంస్కృతి భవనాలు, జిల్లా ఎస్సీ, ఎస్టీ సంగ్రాహాలయం, జిల్లాలోని ప్రతి సమితిలో స్టేడియాలు, స్కిల్ డవలప్‌మెంట్ శిక్షణ, ఇతర కార్యక్రమాలు ఏర్పాటుకు సంబంధించి వివరించారు. కార్యక్రమంలో కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్, ఐటీడీఏ పీవో ఫాల్గుణి మఝి తదితరులు పాల్గొన్నారు.

కొరాపుట్ జిల్లాలో గవర్నర్ పర్యటన



రైతులతో మాట్లాడుతున్న గవర్నర్ రఘుబర్ దాస్

కొరాపుట్: రాష్ట్ర గవర్నర్ రఘుబర్ దాస్ కొరాపుట్ జిల్లాలో గురువారం విస్తృతంగా పర్యటించారు. ఉదయం మల్కన్‌గిరి జిల్లా పర్యటన పూర్తి చేసుకొని కొరాపుట్ జిల్లాకు విచ్చేశారు. దీనిలో భాగంగా ముందుగా జయపురం, బొరిగుమ్మ సమితుల్లో పర్యటించారు. మధ్యాహ్నం జిల్లా కేంద్రంలోని కాఫీ బోర్డును సందర్శించారు. బోర్డు ద్వారా గిరిజనులకు అందుతున్న సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం కాఫీ రైతులకు అందిస్తున్న సహకారాన్ని కలెక్టర్ అబ్దుల్ మహ్మద్ అక్తర్ వివరించారు. అనంతరం సిమిలిగుడ పట్టణంలోని కృషి విజ్ఞాన కేంద్రం సందర్శించారు. అక్కడ సుమారు 250 మంది రైతులు, గిరిజనులతో సభ నిర్వహించారు. వారికి ప్రభుత్వం నుంచి అందుతున్న ప్రోత్సాహకాలు గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతర రాజ్‌పుట్ గ్రామం చేరుకొని మిలెట్ మిషన్ అమలు తీరు పరిశీలించారు. అలాగే పుంగార్ గ్రామంలో ఏకలవ్య మోడల్ రెసిడెన్సియల్ స్కూల్ సందర్శించారు. తదుపరి కొరాపుట్ జిల్లా కేంద్రానికి చేరుకొని సద్భావనా స్వగృహంలో అధికారులతో సమావేశమన్నారు. సాయంత్రం కొరాపుట్‌లోని శబరి శ్రీక్షేత్ర జగన్నాథ మందిరం సందర్శించారు. అక్కడ వేద పండితులు అధికార లంచనాలతో గవర్నర్‌కు స్వాగతం పలికారు. మందిర నిర్మాణం జరిగి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా స్వర్ణోత్సవాల ముగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు.



కాఫీ బోర్డుని పరిశీలిస్తున్న గవర్నర్ రఘుబర్ దాస్ తదితరులు

రాయగడ పర్యటన నేడు

రాయగడ: రాష్ట్రవ్యాప్త పర్యటనలో భాగంగా గవర్నర్ రాయగడలో శుక్రవారం పర్యటించనున్నారు. దీనిలో భాగంగా కొరాపుట్ నుంచి గురువారం ఉదయం 8.30 గంటలకు బయల్దేరి సదరు సమితి గుమ్మకు చేరుకుంటారు. అక్కడ స్వయం సహాయక బృందాలకు చెందిన మహిళలతో మాట్లాడతారు. అనంతరం కడపడి చేరుకుని ఏడబ్ల్యూసీ విద్యార్థులతో మాట్లాడుతారు. 10.35 గంటలకు హలువ చేరుకుని గ్రామస్తులు, రైతులతో ముచ్చటిస్తారు. 11.35 గంటలకు చింతలగుడ, తడమ గ్రామ పంచాయతీల్లో పర్యటిస్తారు. 11.55 గంటలకు తడమ నుంచి బయల్దేరి మధ్యాహ్నం 12.50 గంటలకు జిమిడిపేటలోని సీహెచ్‌సీని సందర్శిస్తారు. మధ్యాహ్నం 3.20 గంటలకు భారిజలలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్సియల్ పాఠశాలను సందర్శించి విద్యార్థులతో ముచ్చటిస్తారు. సాయంత్రం 4.30 గంటలకు రాయగడ పట్టణంలోని జగన్నాథ మందిరం, మజ్జిగౌరి మందిరాలకు వెళ్లి దర్శించుకుంటారు.

పల్లెల్లో ఎర్రచందనం చెట్ల దొంగలు



కట్ చేయగా ఆనవాలుగా మిగిలిన ఎర్రచందనం చెట్టు మొదలు

ఎల్.ఎన్.పేట: ఎర్ర చందనం చెట్ల దొంగలు విజృంభిస్తున్నారు. వారం రోజుల్లో ఐదు ఎర్రచందనం చెట్లు మాయం చేశారు. మండలంలోని కోవిలాం గ్రామంలో రైతులు పొలం గట్లు, కళ్లాల్లో వేసుకున్న ఎర్రచందనం చెట్లు దొంగల పాలవుతున్నాయి. కోవిలాం గ్రామానికి చెందిన రైతులు నడిపల్లి సరస్వతి, కెల్ల అప్పారావు, కెల్ల ఆనందరావులకు చెందిన ఐదు ఎర్ర చందనం చెట్లు వారం రోజుల వ్యవధిలో దొంగలు కట్ చేసి తీసుకుని వెళ్లిపోయారు. గ్రామస్తుల సహకారంతోనే ఎర్రచందనం దొంగలు చెలరేగిపోతున్నారని బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ముగిసిన ప్రజా చైతన్య యాత్ర



విజయ స్థూపం వద్ద కావూరి జయకుమార్‌ను సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఇచ్ఛాపురం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండో సారి ముఖ్యమంత్రి కావాలని కోరుతూ ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం ఈదుముడి గ్రామానికి చెందిన కావూరి జయకుమార్ చేపట్టిన 101 రోజుల ప్రజా చైతన్య యాత్ర గురువారం లొద్దపుట్టిలో ముగిసింది. ఈ సందర్భంగా విజయ సంకల్పయాత్ర విజయ స్థూపం వద్ద జయకుమార్‌ను ఎమ్మెల్సీ నర్తు రామారావు, సమన్వయకర్త పిరియా సాయిరాజ్, మాజీ ఎమ్మెల్యే నరేష్‌కుమార్ అగర్వాలా, ఎంపీపీ బోర పుష్ప, జెడ్పీటీసీ సభ్యురాలు ఉప్పాడ నారాయణమ్మ, ఏఎంసీ చైర్‌పర్సన్ ఎస్.బాబూరావు, డీసీఎంఎస్ మాజీ చైర్‌పర్సన్ సల్ల సుగుణ, పీఏసీఎస్ చైర్మన్ నర్తు నరేంద్ర, వైస్ ఎంపీపీలు దువ్వ వివేకానందరెడ్డి, దున్న గురుమూర్తి, చాట్ల తులసీదాసురెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు ఘనంగా సత్కరించారు. సీఎం జగనన్న జన్మదినం సందర్భంగా ఆయన పైలాన్ వద్ద మొక్కలు నాటారు.

నేడు బొడ్డపాడులో సుబ్బారావు పాణిగ్రాహి వర్ధంతి సభ



అమరవీరుల స్మారక మందిరం వద్ద విలేకరులతో మాట్లాడుతున్న విప్లవ సంఘాల నాయకులు

పలాస: పలాస మండలం బొడ్డపాడు అమరవీరుల స్మారక మందిరం వద్ద శుక్రవారం ఉదయం 10 గంటలకు శ్రీకాకుళం సాయుధ రైతాంగ పోరాట యోధుడు, విప్లవ కవి సుబ్బారావు పాణిగ్రాహి 54వ వర్ధంతి సభను నిర్వహిస్తున్నట్లు అరుణోదయ సాంస్కృతి సమాఖ్య జిల్లా మార్పు మల్లేశ్వరరావు, ప్రజాకళామండలి జిల్లా అధ్యక్షుడు రాపాక చిరంజీవి చెప్పారు. ఈ మేరకు బొడ్డపాడు అమ రుల స్మారక మందిరం వద్ద వారు విలేకరులతో మాట్లాడుతూ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు రెండు కళాసంస్థల ఆధ్వర్యంలో కళాకారులు పాణిగ్రాహి స్మృతి పథంలో తమ ఆటా పాటలతో సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. అలాగే ముందుగా అరుణ ప తాకాన్ని పాణిగ్రాహి సతీమణి సురేఖ పాణి గ్రాహి ఆవిష్కరిస్తారని తెలిపారు. అనంతరం జరిగే బహిరంగ సభలో విరసం రాష్ట్ర నాయకులు పాణి, పీఓడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మీ, అరుణోదయ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నశెట్టి రాజశేఖర్, ప్రజాకళామండలి రాష్ట్ర సహాయకార్యదర్శి కె.నీలకంఠం, రైతు కూలీ సంఘం రాష్ట్ర నాయకులు తాండ్ర ప్రకాష్ తదితరులు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో గొరకల బాలకృష్ణ, పి.కుసుమ, దాసరి శ్రీరాములు, తామాడ త్రిలోచన, మాధవరావు, సార జగన్, బల్ల గోపి, అప్పయ్య, క్రిష్ణవేణి, నీలంరాజు, బి.గోపాలం పాల్గొన్నారు.

సమగ్ర శిక్షా ఉద్యోగులకు పీఆర్‌టీయూ సంఘీభావం

శ్రీకాకుళం న్యూకాలనీ: సమగ్ర శిక్షా ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి వెంటనే చొరవ తీసుకోవాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తంగి మురళీమోహన రావు, దానేటి కేశవరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం వారు కలెక్టరేట్ సమీపంలో మహాత్మా జ్యోతిబాపూలే ప్రాంగణం ఎదురుగా చేపడుతున్న నిరవధిక సమ్మెకు సంఘీభావం తెలిపారు. వెంటనే ప్రభుత్వ పెద్దలు, ఉన్నతాధికారులు వారితో సంప్రదింపులు జరిపి సమ్మె విరమణకు కృషి చేయాలని, వారికి మేలు చేసే నిర్ణయం తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ నాయకులు వసంత రాజారావు, కె.శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి మందసలో బ్రహ్మజ్ఞాన తరగతులు

మందస: మందస పట్టణంలోని శ్రీజగన్నాథ స్వామి ఆలయంలో శుక్రవారం నుంచి బ్రహ్మజ్ఞాన తరగతులు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. ప్రతీ రోజూ ఉదయం 6 నుంచి 7గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి 4గంటల వరకు శ్రీభగవాన్ శ్రీనివాసయోగిస్వామీజీ తరగతులను బోధిస్తారన్నారు. ఆధ్యాత్మికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అన్నకు తలకొరివి పెట్టిన చెల్లెలు



తలకొరివి పెడుతున్న సున్నీశెట్టి

ఇచ్ఛాపురం రూరల్: తండ్రికి తలకొరివి పెట్టాల్సిన బిడ్డలు ఇతర ప్రాంతాల్లో ఉండటంతో వరుసకు చెల్లి అయ్యే మహిళ ఆ బాధ్యతను నెత్తికెత్తుకుంది. కీర్తిపురం గ్రామానికి చెందిన బిమ్మోశెట్టి(50) గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ గురు వారం రాత్రి మృతి చెందారు. కొడుకు గిరి శెట్టి బెంగళూర్‌లో ఉన్నారు. బిమ్మో శెట్టికి భార్య, కుమార్తె ఉన్నప్పటికీ ఒడియా సంప్రదాయం ప్రకారం తలకొరివి పెట్టేందుకు వీలు కాకపోవడంతో బావమరిది భార్య సున్నీశెట్టి తలకొరివి పెట్టేందుకు ముందుకువచ్చారు. ఆమె గురువారం ఉదయం నిర్వహించిన దహన సంస్కారాల్లో పాల్గొన్నారు.

వాడుక నీటి రీసైక్లింగ్ వర్క్‌షాపు



వర్క్‌షాపులో పాల్గొన్న అధికారులు

జయపురం: పట్టణంలోని ఒక ప్రైవేటు హోటల్‌లో జయపురం మున్సిపాలిటీ, కోట్‌పాడ్ నోటిఫైడ్ ఏరియా కౌన్సిల్‌లు సంయుక్తంగా వాడుక నీటి రిసైక్లింగ్ వర్క్‌షాపు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర గృహ పట్టణాభివృద్ధి అదనపు కార్యదర్శి ప్రభాత్ కుమార్ మహాపాత్రో మాట్లాడుతూ.. స్నానం, ఇంటి వాడుక, వాషింగ్ మెషిన్, వంట నీటిని రీసైక్లింగ్‌లో శుద్ధిచేసి తిరిగి వినియోగించవచ్చని వివరించారు. ఇళ్లలో వినియోగించే నీరు జలాశయాలు, నదుల్లో కలవకుండా తిరిగి వినియోగంలోకి తీసుకొని రావడమే వర్క్‌షాపు ముఖ్యోద్దేశమని పేర్కొన్నారు. ఇలా చేయడం వలన నీరు, వాయు కాలుష్యం తగ్గడంతో పాటు నీటి కొరత తీరుతుందని వెల్లడించారు. దీనిపై మరింత వివరంగా చెప్పేందుకు ఈనెల 26వ తేదీన మున్సిపాలిటీ ఉద్యోగులు ఖుర్దాలో నిర్వహిస్తున్న రీసైక్లింగ్ యూనిట్‌ను సందర్శించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో జయపురం మున్సిపాలిటీ చైర్మన్ నరేంద్ర కుమార్ మహంత, వైస్ చైర్మన్ బి.సునీత, జయపురం మున్సిపాలిటీ కార్యనిర్వాహక అధికారి విశ్వనాథ్ పాత్రో, కోట్‌పాడ్ ఎన్‌ఏసీ చైర్మన్ ఎం.శంకరరావు, వైస్ చైర్మన్ ఎం.సంతోషి, కార్యనిర్వాహక అధికారి రాజేంద్ర కుమార్ ఖొర తదితరులు పాల్గొన్నారు.

కొలువు కుదిరింది

ఎస్‌ఐ పరీక్ష ఫలితాల్లో జిల్లా వాసులు ప్రతిభ చూపించారు. పట్టుదలతో చదివి అనుకున్న కొలువును కొట్టారు. వీరిలో కొందరిది నిరుపేద నేపథ్యం కాగా.. మరికొందరు ఒక ఉద్యోగంలో ఉంటూనే ఈ ఉన్నత ఉద్యోగాన్ని సాధించారు.

పట్టుదలతో చదివి..



మధుసూదనరావు



మణికంత

నరసన్నపేట: మండలంలోని కిళ్లాంకు చెందిన కొత్తంటి మదుసూదనరావ ఎస్‌ఐ పోస్టుకు ఎంపికయ్యారు. ఇప్పటికే ఆయన తెలంగాణ రాష్ట్రంలో కానిస్టేబుల్‌గా కూడా ఎంపికయ్యారు. 23 సంవత్సరాల మధుసూదనరావుకు తండ్రి లేరు. చిన్నప్పుడే తండ్రి చనిపోగా తల్లి శాంతమ్మ రెక్కల కష్టంతో మదుసూదనరావు సోదరులు పెరిగి పెద్దయ్యారు. మబగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో టెన్త్ పూర్తి చేసిన మధుసూదనరావు ఇంటర్ నరసన్నపేటలో ఒక ప్రైవేటు కళాశాల్లో పూర్తి చేశా రు. డిగ్రీ శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాలలో చదివారు. ఈయన అన్న నవీన్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నారు. మధుసూదనరావు తల్లికి సహాయం చేస్తూ కూలి పనులకు కూడా వెళ్లారు. ఫొటోగ్రాఫర్‌గానూ పనిచేశారు. గ్రామ యువకులు నిర్వహిస్తున్న లైబ్రరీలోనే పుస్తకాలను చదువుకుంటూ పోటీ పరీక్షలకు సిద్ధమయ్యారు. మధుసూదనరావు ఎస్‌ఐ ఉద్యోగానికి ఎంపిక కావడంపై ఊరివారంతా సంబర పడుతున్నారు. పట్టుదలతో చదవడంతో ఉద్యోగాన్ని సాధించగలిగానని ఆయన తెలిపారు.

అగ్నిమాపక కానిస్టేబుల్..

స్థానిక అగ్నిమాపక కేంద్రంలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న ఊణ్ణ మణికంత ఎస్‌ఐగా ఎంపికయ్యారు. ఈయన స్వగ్రామం శ్రీకాకుళం మండలం బలివాడ గ్రామం. తండ్రి కృష్ణారావు చిరు వ్యాపారి. రాయలసీమ జోన్‌కు ఎంపికైనట్లు మణికంత విలేకరులకు తెలిపారు.

వ్యవసాయ కూలీ ఇంట..



నీలవేణి

ఎల్.ఎన్.పేట: మండలంలోని పెద్దకోట గ్రామానికి చెందిన బమ్మిడి నీలవేణి ఎస్‌ఐ ఉద్యోగాన్ని సాధించారు. నీలవేణి తల్లిదండ్రులు బమ్మిడి సింహాచలం, కొండమ్మలు వ్యవసాయ కూలీలుగా పనిచేస్తూ పిల్లలను చదివిస్తున్నారు. వీరి ముగ్గురు పిల్లల్లో పెద్ద కుమార్తె నీలవేణి మొదటిసారి పోటీ పడి జోన్-1లో ఎస్‌ఐ ఉద్యోగాన్ని సాధించారు. ఆమె ప్రాథమిక విద్య ఎంపీపీ స్కూల్ పెద్దకోట, ఉన్నత విద్య జెడ్పీ ఉన్నత పాఠశాల లక్ష్మీనర్సుపేట, ఇంటర్ విద్య ప్రభుత్వ జూనియర్ కాలేజీ లక్ష్మీనర్సుపేట, డిగ్రీ హిరమండ లం గాయత్రి కాలేజీలో చదువుకున్నారు. కోచింగ్ తీసుకుంటూ ఎస్‌ఐ పోటీ పరీక్షలకు సిద్ధమయ్యానని నీలవేణి తెలిపారు. మొదటి సారి పోటీ పరీక్షలోనే ఉద్యోగం సాధించానని అన్నారు. నీలవేణి ఎస్‌ఐ ఉద్యోగం సాధించటంతో తల్లిదండ్రులు, గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

పేద కుటుంబం నుంచి వచ్చి..



కార్తీక్

మందస: మండలంలోని ఉద్దాన ప్రాంతమైన రాంపురం పంచాయతీ టి.గంగువాడ గ్రామానికి చెందిన చిత్త కార్తీక్ ఎస్‌ఐ ఉద్యోగానికి ఎంపికయ్యారు. పరీక్ష ఫలితాల్లో 236 మార్కులతో 279వ ర్యాంకు సాధించి, సివిల్ ఎస్‌ఐగా ఎంపికయ్యారు. కార్తీక్ తల్లిదండ్రులు చంద్రశేఖర్, లక్ష్మి దంపతులు పేద కుటుంబానికి చెందిన వారు. తమ కుమారుడు ఎస్‌ఐ ఉద్యోగానికి ఎంపిక కావడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. కార్తీక్‌కు స్థానికులు గురువారం అభినందనలు తెలిపారు.

కానిస్టేబుల్ టు ఎస్‌ఐ



భాస్కరరావు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎస్‌ఎంపురం గ్రామానికి చెందిన వావిలపల్లి భాస్కరరావు 2018లో ఆర్మ్‌డ్ రిజర్వ్ కానిస్టేబుల్‌గా ఎంపికై విధులు నిర్వహిస్తున్నాడు. అప్పటి నుంచి ఎస్‌ఐ నోటిఫికేషన్ కోసం ఎదురు చూస్తూ చదువుతున్నాడు. ఎస్‌ఐ ఫలితాల్లో ఏపీఎస్‌పీ ఓపెన్ కేటగిరీలో 17 ర్యాంకు సాధించి ఏపీఎస్‌పీ ఎస్‌ఐగా ఎంపికయ్యాడు. 229 మార్కులు సాధించాడు. తల్లిదండ్రులు వరహాలు, మణిలది వ్యవసాయ నేపథ్యం.

క్లుప్తంగా

కరోనా పట్ల అప్రమత్తం

● ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర



ఆధునిక వైద్యపరికరాలను ప్రారంభిస్తున్న ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

సాలూరు: దేశంలో మళ్లీ కరోనా కేసులు నమోదవుతున్న నేపథ్యంలో వైద్యారోగ్యశాఖ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమశాఖామంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన సాలూరు పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో ఏర్పాటుచేసిన ఆధునిక ఈసీజీ, ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్, తదితర మిషన్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మారుమూల గిరిజన ప్రాంతాలకు అత్యాధునిక వైద్యపరికరాలు ఏర్పాటుచేస్తూ వైద్యానికి ముఖ్యమంత్రి వైఎస్‌జగన్ మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారన్నారు.

జాతీయ ఖోఖో పోటీలకు దిలీప్ ఎంపిక



జాతీయ ఖోఖో పోటీలకు ఎంపికైన దిలీప్

విజయనగరం: జాతీయస్థాయిలో జరగనున్న ఖోఖో పోటీలకు నగరానికి చెందిన బార దిలీప్ ఎంపికయ్యాడు. గత నెలలో చిత్తూరు జిల్లాలో జరిగిన రాష్ట్ర స్థాయి జూనియర్స్ బాలుర ఖోఖో పోటీల్లో విజయనగరం జట్టు తరపున ప్రాతినిధ్యం వహించి ఉత్తమ క్రీడా ప్రదర్శనతో రాష్ట్ర జట్టులోకి అర్హత సాధించాడు. ప్రస్తుతం విజయనగరంలో ఇంటర్‌మీడియట్ అభ్యసిస్తున్న దిలీప్ ఈనెల 21 నుంచి 25వ తేదీ వరకు రాయపూర్‌లో జరగనున్న జాతీయ పోటీల్లో ఆడనున్నాడు. ఈ సందర్భంగా దిలీప్‌ను జిల్లా ఖోఖో అసోసియేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి కె.గోపాల్, కళాశాల ప్రిన్సిపాల్ అభినందించారు.

పార్వతీపురంలోచైన్ స్నాచింగ్



సంఘటన స్థలంలో వివరాలు సేకరిస్తున్న సీఐ కృష్ణారావు

పార్వతీపురంటౌన్: పట్టణంలో చైన్‌స్నాచింగ్ కలకలం రేపింది. స్థానిక అజయ్‌నగర్ కాలనీకి చెందిన కృష్ణవేణి గురువారం వేకువ జామున గుడికివెళ్లి తిరిగి వస్తుండగా బైక్‌పై వచ్చిన ఇద్దరు దుండగులు ఆమె మెడలో ఉన్న రెండు తులాల చైన్‌ను తెంపుకుని పోయారు. ఈ మేరకు బాధితురాలు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఫిర్యాదు మేరకు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ కృష్ణారావు తెలిపారు.

పలువురికి గాయాలు



కురుపాం సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

గుమ్మలక్ష్మీపురం: ప్రయాణికులతో వస్తున్న ఆటో చెట్టును ఢీ కొనడంతో పలువురు గాయలపాలయ్యారు. గుమ్మలక్ష్మీపురం మండలం దేరువాడ గ్రామానికి చెందిన కొంతమంది దుడ్డుఖల్లు గ్రామంలో పొలం పనుల కోసం గురువారం ఆటోలో బయల్దేరి వస్తుండగా మార్గమధ్యంలోని కంబగూడ గ్రామ సమీపంలో ఆటో అదుపుతప్పి చెట్టును ఢీ కొంది.ఈ ప్రమాదంలో ఆటోలోని ప్రయాణికులకు గాయాలవ్వగా..సమీపంలోని దుడ్డుఖల్లు పీహెచ్‌సీకి తరలించారు. వారిలో స్వల్పగాయాలైన వారిని ప్రథమ చికిత్స అనంతరం డిశ్చార్జ్ చేశారు. మిగిలిన వారికి తీవ్రంగా గాయాలు కావడంతో కురుపాం సామాజిక ఆరోగ్య కేంద్రానికి రిఫర్ చేయగా వైద్యసేవలు పొందుతున్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన అవసరం

విజయనగరం ఫోర్ట్: హెచ్‌ఐవీ ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని ఆర్‌కేఎస్‌కే కౌన్సిలర్ అంబళ్ల కొండమ్మ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఐటీఐలో గురువారం హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. హెచ్‌ఐవీ వచ్చిన తర్వాత బాధపడేకంటే రాకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. హెచ్‌ఐవీ ఏవిధంగా వ్యాప్తి చెందుతుంది, రాకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శ్రీధర్, పాల్గొన్నారు.



పెదమేరంగి కూడలిలో కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్ సీపీ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు పరీక్షిత్‌రాజు



ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పేరిట పాలకొండ కోటదుర్గమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, తదితరులు



పార్వతీపురం పట్టణంలో కేక్‌కట్‌చేస్తున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు

ఆయుష్మాన్‌భవ..!

- ఊరూరా ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు
- సీఎం చిత్రపటాలకు క్షీరాభిషేకాలు
- పలుచోట్ల రక్తదాన శిబిరాల నిర్వహణ
- రామతీర్థంలో ప్రత్యేక పూజలు, అన్నదానం
- ఆస్పత్రుల్లోని రోగులకు పండ్లు, పేదలకు దుస్తుల పంపిణీ



సాలూరు ఏరియా ఆస్పత్రిలో ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం, గిరిజన సంక్షేమ శాఖమంత్రి పీడిక రాజన్నదొర

సాక్షి ప్రతినిధి, విజయనగరం: సంక్షేమ, అభివృద్ధి ప్రదాత ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఉమ్మడి విజయనగరం జిల్లాలో గురువారం ఊరూరా ఉత్సాహంగా సాగాయి. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వేడుకల్లో పాల్గొన్నారు. కేక్‌లు కట్‌చేసి పంచిపెట్టారు. అభిమాన నేత నూరేళ్లపాటు ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షిస్తూ ఆలయాల్లో పూజలు, చర్చిలు, మసీదుల్లో ప్రార్థనలు జరిపారు. రక్తదానం చేశారు. పేదలకు దుస్తులు, ఆస్పత్రుల్లోని రోగులకు పండ్లు పంపిణీ చేశారు. పలు చోట్ల అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

➡ పార్వతీపురం పట్టణంలో జగనన్న జన్మదిన వేడుకలు ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో మొక్కలు నాటారు. మహిళలకు రంగవల్లుల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కేక్‌కట్‌చేసి అభిమానులకు పంచిపెట్టారు. పేదలకు అన్నదానం చేశారు.

➡ పాలకొండ వైఎస్సార్ కూడలి వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహానికి ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలకొండ విక్రాంత్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కోట దుర్గమ్మ దేవస్థానంలో జగన్ పేరిట ప్రత్యేక అర్చనలు జరిపారు. ఎమ్మెల్సీ విక్రాంత్ ఇంటి వద్ద పాలవలస రాజశేఖర్ చేతుల మీదుగా కేక్ కట్‌చేసి స్వీట్లు పంపిణీ చేశారు.

➡ సాలూరు నియోజకవర్గ కేంద్రంలో డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర ఆధ్వర్యంలో జగనన్న జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక వైఎస్సార్ కూడలి వద్ద వై.ఎస్.విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి ముఖ్యమంత్రి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ మిఠాయిలు పంచిపెట్టారు. నవజీవన ఆశ్రమంలో నిరాశ్రయులకు అన్నదానం చేశారు. ఏరియా ఆస్పత్రిలో రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. రక్తదాన శిబిరం నిర్వహించారు.

➡ కురుపాం నియోజకవర్గంలోని జియ్యమ్మవలస మండలం పెదమేరంగి కూడలిలో సీఎం జగన్ మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మూడడ్ల గౌరీశంకరరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి పార్టీ జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు హాజరై కేక్ కట్‌చేశారు. 2000 మందికి అన్నసమారాధన జరిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు శశికళ, డీసీసీబీ డైరెక్టర్ లోలుగు నారాయణరావు, నాయకులు బాబూ భువనమోహనరావు, సర్పంచ్ కోట రమేష్, మరడాన కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

➡ విజయనగరం జిల్లా పరిషత్ కార్యాలయం ప్రాంగణంలో నిర్వహించిన జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజు వేడుకల్లో భాగంగా జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు దివ్యాంగులకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు.

➡ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి నివాసంలో నిర్వహించిన వేడుకల్లో ఆయనతో పాటు ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు, నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్‌లు కోలగట్ల శ్రావణి, మచ్చు లయా యాదవ్, ఎంపీపీ మామిడి అప్పలనాయుడు పాల్గొన్నారు. నిరుపేద దివ్యాంగులకు బ్యాటరీతో నడిచే త్రిచక్ర వాహనాలను పంపిణీ చేశారు.

➡ నెల్లిమర్ల నియోజకవర్గంలోని రామతీర్థంలో నిర్వహించిన ముఖ్యమంత్రి జన్మదిన వేడుల్లో ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు, నియోజకవర్గ పరిశీలకుడు అంధవరపు సూరిబాబు పాల్గొన్నారు. రాములోరి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. భక్తులకు అన్నసంతర్పణ చేశారు.

పంప్‌హౌస్ పంపింగ్ సామర్థ్యం పెంపు



సంకిలి వద్ద ఉన్న తాగునీటి పంపుహౌస్‌ను పరిశీలిస్తున్న ఇన్‌చార్జ్ మున్సిపల్ కమిషనర్ వెంకట్

రాజాం: పట్టణ వాసులకు తాగునీరు అందిస్తున్న రేగిడి మండలంలోని సంకిలి గ్రామ నాగావళి నదీ తీరాన ఉన్న పంప్‌హౌస్‌ను ఇన్‌చార్జ్ మున్సిపల్ కమిషనర్ పి.వెంకట్ గురువారం పరిశీలించారు. పంపింగ్ సామర్థ్యం తగ్గిందని గుర్తించిన ఆయన విశాఖపట్నానికి చెందిన కిరలాస్కర్ కంపెనీ టెక్నికల్ మెకానిక్‌లతో మరమ్మతులు చేయించి, పంప్ హౌస్ మోటార్ల పంపింగ్ సామర్థ్యం పెంచారు. అంతకుముందు రాజాం పట్టణంలోని రక్షిత మంచినీటి పథకాలను పరిశీలించి, తాగునీటి పంపింగ్ సామర్థ్యాన్ని మెకానిక్‌లను అడిగి తెలుసుకున్నారు. మోటార్ల ద్వారా పట్టణానికి 4.17 ఎమ్‌ఎల్‌టీ నీటిని పంప్ చేయాల్సి ఉండగా, పంపింగ్ సామర్థ్యం తగ్గిందని, దీంతో పంపింగ్ సామర్థ్యం పెంచామన్నారు.

ముగిసిన హ్యాక్‌థాన్ గ్రాండ్ ఫినాలే



విజేతలతో నిర్వాహకులు

రాజాం సిటీ: స్మార్ట్ ఇండియా హ్యాక్‌థాన్ వంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలని జీఎంఆర్ ఐటీ గవర్నింగ్ కౌన్సిల్ సభ్యుడు ఇ.శంకరరావు పిలుపునిచ్చారు. స్థానిక జీఎంఆర్ ఐటీలో రెండు రోజులపాటు సాగిన హ్యాక్‌థాన్–2023 సాఫ్ట్‌వేర్ ఎడిషన్ గ్రాండ్ ఫినాలే బుధవారం రాత్రి 11.30 గంటల వరకు సాగింది. ఈ పోటీలో 11 రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు 26 బృందాలుగా పాల్గొన్నారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఏఐసీటీఈ కేటాయించిన ముఖ్యమైన సమస్యలపై విద్యార్థులు చేసిన కృషిని అభినందించారు.

విజేతలు వీరే..

భారతదేశంలో ప్రాథమిక రంగం వ్యవసాయాన్ని మెరుగుపర్చడం, మన వ్యవసాయ ఉత్పత్తులను నిర్వహించడం అనే అంశంపై మహారాష్ట్ర నాందేడ్‌లోని గురుగోవింద్ సింగ్ ఐటీ విద్యార్థులు విజేతగా నిలిచారు. వారసత్వం–సంస్కృతి అనే అంశంపై పంజాబ్‌కు చెందిన థాపర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ విద్యార్థులు బహుమతి గెలుపొందారు. ఫిట్‌నెస్ అండ్ క్రీడలు అంశంపై తమిళనాడుకు చెందిన సవిత స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ విద్యార్థులు, మహారాష్ట్రకు చెందిన సరస్వతి కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ విద్యార్థులు సంయుక్త విజేతలుగా నిలిచారు. బొమ్మలు, ఆటలు అనే అంశంపై కర్నాటకకు చెందిన జీఎంఐటీ విద్యార్థులు విజేతలుగా నిలిచారు. విజేతలకు నగదు బహుమతితోపాటు షీల్డ్‌లను నిర్వాహకులు అందజేశారు. విజేతలను ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ గిరీష్, ప్రిన్సిపాల్ సీఎల్‌వీఆర్‌ఎస్‌వీ ప్రసాద్‌లు అభినందించారు.

శతశాతం ఉత్తీర్ణతకు అవగాహన సదస్సులు



విద్యార్థుల అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటి డైరెక్టర్ బోని రామానందం

- 14సోషల్ వెల్ఫేర్ వసతి గృహాల్లో ప్రత్యేక క్యాంపులు
- సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రామానందం

గజపతినగరం: విజయనగరం సాంఘిక సంక్షేమ శాఖ రూరల్ పాఠశాలల పరిధిలో చదువుతున్న 10వ తరగతి విద్యార్థులందరికీ ప్రత్యేక ప్రేరణ, అవగాహన సదస్సులను ఏర్పాటు చేస్తున్నామని, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ బోని రామానందం తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన గజపతినగరం ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహాన్ని సందర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా 14 సోషల్ వెల్ఫేర్ (ప్రీమెట్రిక్) వసతి గృహాలు ఉన్నాయని అందులో 156 మంది 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఉన్నారని వారికోసం విడతల వారీగా ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేసి శతశాతం ఉత్తీర్ణతకు కసరత్తు చేస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో మొదటి క్యాంపు గజపతినగరంలో ఏర్పాటు చేశామన్నారు. ప్రతి విద్యార్థికి నాణ్యమైన కార్పొరేట్ స్థాయి విద్యాబోధన అందేలా చూస్తూ వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిని ఎ గ్రేడ్ స్థాయికి తీసుకువచ్చి శతశాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించేలా కృషి చేస్తామని రామానందం చెప్పారు. కార్యక్రమంలో ఏఎస్‌డబ్ల్యూఓ వీఎల్‌ఎం స్వరూప కుమారి, గజపతినగరం, బొండపల్లి, లోగీశ, గర్భాం, రామతీర్థం, గంట్యాడ వసతిగృహాల సంక్షేమ అధికారులు ఎం.గౌరి, కె.గౌరీలక్ష్మి, ఎస్.అప్పలనాయుడు, ఎస్.వెంకటరావు, జి.సింహాచలం, జి.సన్యాశిరావులతో పాటు గజపతినగరం సాంఘిక సంక్షేమ కళాశాల బాలికలు, బాలుర వసతి గృహ సంక్షేమ అధికారులు పి.మీనాక్షి, ఎస్.రామకృష్ణ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

భోగాపురం: మండలంలోని రాజాపులోవ గ్రామంలో ఒక ఇంట్లో జరిగిన అగ్ని ప్రమాదంలో గాయపడిన కిలారి అప్పయ్యమ్మ(75) విశాఖపట్నం కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు ఏఎస్సై రాజు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. ఈనెల 15వ తేదీన ఇంట్లో మంట వేసుకుని చాలి కాగుతుండగా ప్రమాదవశాత్తు చీరకు నిప్పు అంటుకుని అప్పయ్యమ్మ తీవ్ర గాయాలపాలైంది. దీంతో కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను విశాపట్నం కేజీహెచ్‌కు తరలించారు. మృతురాలి కుమారుడు రాములప్పుడు ఫిర్యాదు మేరకు కేసు చేసినట్లు ఏఎస్సై తెలిపారు.

హెచ్‌సీపై గుర్తు తెలియని వ్యక్తుల దాడి

భోగాపురం: మండలంలోని పోలిపల్లి గ్రామ సమీపంలో టీడీపీ నాయకులు నిర్వహించిన యువగళం ముగింపు సభ సందర్భంగా విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ కేఎస్ మూర్తిపై నలుగురు దుండగులు దాడి చేశారు. ఈ సందర్భంగా మూర్తి మెడలోని బంగారు గొలుసుకు ఉన్న లాకెట్ పోయింది. దీనిపై హెచ్‌సీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై సూర్యకుమారి తెలిపారు.

తప్పులులేని ఓటరు జాబితాలు సిద్ధం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల రోల్ అబ్జర్వర్ శ్యామలరావు

పార్వతీపురం: ఓటరు ముసాయిదా జాబితాలో మార్పులు, చేర్పులు, సవరణకు సంబంధించిన నివేదికలను సిద్ధం చేయాలని జిల్లా ఎన్నికల పరిశీలకుడు జె.శ్యామలరావు ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఓటరు నమోదు అధికారులతో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఫారం –6, 7, 8 ఆధారంగా ఓటర్ల జాబితా రూపకల్పనలో అవలంభిస్తున్న విధానాలపై అసెంబ్లీ నియోజకవర్గాలు, పోలింగ్ కేంద్రాల వారీగా సమీక్షించారు. డిసెంబర్ 26వ తేదీ వరకు అందిన అభ్యంతరాలను పరిష్కరించి తప్పులులేని తుది ఓటరు జాబితా ప్రకటించాలని సూచించారు. సమావేశంలో జేసీ గోవిందరావు, డీఆర్‌ఓ జె.వెంకటరావు, సీతంపేట ఐటీడీఏ పీఓ కల్పనా కుమారి, పార్వతీపురం ఐటీడీఏ పీఓ సి.విష్ణుచరణ్, ఆర్డీఓలు ఎం.లావణ్య, కె.ఆర్.ఆర్.సి.శివకేశవనాయుడు, ఎన్నికల సెక్షన్ సూపరింటెండెంట్ రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

పెట్రోల్ బంకులో ఉద్యోగాలకు రాతపరీక్ష



రాతపరీక్షకు హాజరైన అభ్యర్థులు

సీతంపేట: ఐటీడీఏ ఆధ్వర్యంలో పాలకొండలో నిర్వహించే పెట్రోల్ బంకులో ఉద్యోగాల భర్తీకి గురువారం స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో రాతపరీక్ష నిర్వహించారు. ఒక సూపర్ వైజర్ ఉద్యోగానికి 52 మంది దరఖాస్తు చేసుకోగా 41 మంది హాజరయ్యారు. 7 పంప్‌బాయ్ ఉద్యోగాలకు 128 మంది దరఖాస్తుచేసుకోగా 87 మంది పరీక్ష రాశారు. ఐటీడీఏ ఏపీఓ రోసిరెడ్డి, డీడీ మంగవేణి, ఏఎంఓ కోటిబాబు, జీసీడీఓ రాములమ్మ, తదితరులు పరీక్షకేంద్రాన్ని పర్యవేక్షించారు.

23న సెంచూరియన్ వర్సిటీ స్నాతకోత్సవం



సమావేశంలో మాట్లాడుతున్న సెంచూరియన్ వర్సిటీ వీసీ ప్రొఫెసర్ పి.కె.మహంతి

నెల్లిమర్ల రూరల్: టెక్కలిలోని సెంచూరియన్ విశ్వవిద్యాలయం మూడో స్నాతకోత్సవ వేడుకలను ఈ నెల 23న నిర్వహించనున్నట్టు వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ప్రశాంతకుమార్ మహంతి తెలిపారు. వర్సిటీలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. స్నాతకోత్సవంలో ఒకరికి డాక్టరేట్, 140 మందికి డిగ్రీలను ప్రదానం చేస్తామన్నారు. 12 మందికి బంగారు పతకాలు, ఏడుగురికి నగదు ప్రోత్సాహకాలు అందిస్తామని చెప్పారు. విశ్వ విద్యాలయంలో ఆచరణాత్మక పద్ధతుల్లో విద్యను బోధించడం వల్ల విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధిస్తున్నారన్నారు. రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి మాట్లాడుతూ మార్కెట్‌లో నేడు డిమాండ్ ఉన్న కోర్సులను వర్సిటీలో అందుబాటులో ఉంచామని చెప్పారు. వేడుకలను చాన్సలర్ ప్రొఫెసర్ జీఎస్‌ఎన్ రాజు, చైర్మన్ ప్రొఫెసర్ ముక్తికాంత మిశ్రా ప్రారంభిస్తారన్నారు. కార్యక్రమంలో డీన్‌లు డాక్టర్ మాధవరావు, ఎంఎల్‌ఎస్ ఆచార్యులు, డాక్టర్ సన్నీడియోల్ పాల్గొన్నారు.

గిరి ప్రదక్షిణ భక్తులకు శుభప్రదం

● స్వామి శ్రీనివాసానంద సరస్వతి



మాట్లాడుతున్న ఏపీ సాధుపరిషత్ అధ్యక్షుడు స్వామీ శ్రీనివాసానంద సరస్వతి

విజయనగరం టౌన్: ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ నెల 23న రామతీర్థంలో నిర్వహించే గిరి ప్రదక్షిణ కార్యక్రమంలో పాల్గొనడం భక్తులకు శుభప్రదమని ఏపీ సాధుపరిషత్ అధ్యక్షుడు స్వామీజీ శ్రీనివాసానంద సరస్వతి పిలుపునిచ్చారు. ఈ మేరకు స్థానిక హిందూ ధర్మ రక్షణ సమితి కార్యాలయంలో గురువారం సాయంత్రం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సకల దేవతల చుట్టూ ప్రదక్షిణ చేసిన ఫలితం, పుణ్యం వస్తుందన్నారు. సింహాచలం, అన్నవరం, శ్రీకాళహస్తిలలో గిరిప్రదక్షిణకు ఎంతటి ప్రాముఖ్యం ఉందో, రామతీర్థం గిరిప్రదక్షణకు అంతటి ప్రాశస్త్యం ఉందన్నారు. ఈ నెల 23న ఉదయం 8 గంటలకు గిరిప్రదక్షిణ పూజా కార్యక్రమం అనంతరం ప్రదక్షిణ ప్రారంభమవుతుందన్నారు. వేలాదిమందితో రామనామ సంకీర్తనలు, భజనలతో అంగరంగ వైభవంగా జరిగే గిరి ప్రదక్షిణలో పెద్ద ఎత్తున హిందూ బంధువులు పాల్గొనాలని కోరారు. ప్రభుత్వ యంత్రాంగం భక్తులకు మంచినీరు, అన్నప్రసాదం ఏర్పాట్లు చేయాలని సూచించారు. రామతీర్థం సేవా పరిషత్ వ్యవస్థాపకుడు జ్యోతిప్రసాద్ మాట్లాడుతూ రామతీర్థంలో ఉన్న రామగిరి ఎంతో ప్రాశస్త్యమైనదని, దానిచుట్టూ గిరి ప్రదక్షిణ చేయడం పుణ్యప్రదమన్నారు. ఆర్టీసీ ప్రత్యేక బస్సులు వేయాలని, భక్తులకు ఇబ్బంది లేకుండా దేవాదాయశాఖ అధికారులు ఏర్పాట్లు చేయాలని కోరారు. సమావేశంలో హిందూ ధర్మ రక్షణ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందివాడ వేణుగోపాల్, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎ.శ్యామ్‌సుందర్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పోటీలకు బాడంగి విద్యార్థులు



తెర్లాం: సర్టిఫికెట్లతో విద్యార్థులు

బాడంగి: జిల్లా స్థాయి చెకుముకి పోటీలకు మండలానికి చెందిన విద్యార్థులు ఎంపికైనట్లు నిర్వాహకు లు గురువారం తెలిపారు. గురువారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన మండల స్థాయి చెకుముకి పోటీల్లో పాల్తేరు జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి ఎ.అశోక్, బి.వరుణ్‌కుమార్, పి.గీతాంజలి, బాడంగి జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి జె.గణేశ్, బి.గీత, కృష్ణలోహిత విశేష ప్రతిభ కనబరిచి, జిల్లా పోటీలకు ఎంపికయ్యారన్నారు. వీరంతా జనవరి 17వ తేదీన జరిగే జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. 2023 సైన్స్ సంబరాల్లో భాగంగా 8, 9, 10వ తరగతుల విద్యార్థుల్లో సైన్స్ పరిజ్ఞానం పెంపొందించడమే లక్ష్యంగా ఈ పోటీలు నిర్వహిస్తుండ డం గమనార్హం. కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయు లు కె.ఈశ్వరరావు, డి.రమేష్, ప్రసాద్, రామారావు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మండల స్థాయికి 30 మంది..

తెర్లాం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం జరిగిన పాఠశాల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్‌లో మండల స్థాయి పోటీలకు 30 మంది విద్యా ర్థులు ఎంపికయ్యారని ఎంఈవో త్రినాథరావు తెలి పారు. జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో గురువారం జరిగిన చెకుముకి ట్యాలెంట్ టెస్ట్‌కు మండలంలోని 10 జెడ్పీ ఉన్నత పాఠశాలల నుంచి విద్యార్థులు హాజరయ్యారన్నారు. విజేతలైన విద్యార్థులందరికీ సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో– 2 పాపారావు తదితరులు పాల్గొన్నారు.

రేగిడి: మండలంలోని సంకిలి జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల చెకుముకి టాలెంట్ టెస్ట్ గురువారం నిర్వహించారు. ఈ పోటీల్లో దేవుదళ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానం, రేగిడి, లక్ష్మీపురం జెడ్పీ ఉన్నత పాఠశాలల విద్యార్థులు ద్వితీయ స్థానాలను కైవసం చేసుకున్నారు. ప్రథమ స్థానంలో నిలిచి విద్యార్థులు జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు.